క్లుప్తంగా

చెవిటి, మూగ, బధిర విద్యార్థులకు అండగా ఉంటాం..

- చిన్న శ్రీను సోల్జర్స్ అధ్యక్షురాలు మజ్జి సిరిసహస్ర



చెవిటి, మూగ, బధిరుల సంస్థ సభ్యులతో మజ్జి సిరి సహస్ర

విజయనగరం రూరల్: చెవిటి, మూగ, బధిరులకు అండగా ఉంటామని చిన్న శ్రీను సోల్జర్స్ అధ్యక్షురాలు మజ్జి సిరి సహస్ర అన్నారు. జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు నివాసానికి బుధవారం విచ్చేసిన చెవిటి, మూగ, బధిర సంస్థ సభ్యులు మజ్జి సిరిసహస్రను మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పలు సమస్యలను ఆమె దృష్టికి తీసుకురాగా.. పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని తెలిపారు. అనంతరం వారికి ప్రత్యేక భోజన ఏర్పాట్లు చేశారు.

నేడు కార్పొరేషన్ కౌన్సిల్ సమావేశం

విజయనగరం: మున్సిపల్ కార్పొరేషన్ సాధారణ సమావేశం గురువారం నిర్వహించనున్నట్లు నగర మేయర్ వెంపడాపు విజయలక్ష్మి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 గంటలకు కార్పొరేషన్ కార్యాలయ సమావేశ మందిరంలో జరగనున్న సమావేశంలో నగరంలో నూతన అభివృద్ధి పనులు చేపట్టేందుకు తీర్మానాలు చేయడంతో పాటు ప్రజా సమస్యలపై చర్చించి వాటి పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకుంటామన్నారు. సమావేశానికి పాలక వర్గ సభ్యులతో పాటు అధికారులు, సిబ్బంది హాజరుకావాలని కోరారు.

పక్కాగా రీ సర్వే



మాట్లాడుతున్న తహసీల్దార్ ప్రవల్లిక ప్రియ

పూసపాటిరేగ: సమగ్ర భూసర్వే పక్కాగా నిర్వహించాలని తహసీల్దార్ ప్రవల్లిక ప్రియ రెవెన్యూ అధికారులకు సూచించారు. మండలంలోని కనిమెల్లలో బుధవారం అవగాహన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, సర్వేలో ఎటువంటి తప్పిదాలు చోటుచేసుకోకుండా ఉండేందుకు రైతులు పూర్తిస్థాయి సమాచారాన్ని అధికారులకు తెలియజేయాలన్నారు. అనంతరం కనిమెల్ల, అల్లాడపాలెం గ్రామాల్లోని పోలింగ్‌బూత్‌లను పరిశీలించారు. బూత్‌లలో మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేయాలని కార్యదర్శి, వీఆర్ఓలను ఆదేశించారు.

కుళాయి పనులకు శంకుస్థాపన



ఇంటింటి కుళాయి పనులకు శంకుస్థాపన చేస్తున్న జెడ్పీటీసీ సభ్యురాలు సీతాలక్ష్మి

పూసపాటిరేగ: మండల కేంద్రంలో జల్‌జీవన్ మిషన్ పథకంలో భాగంగా కుళాయిల ఏర్పాటుకు జెడ్పీటీసీ సభ్యురాలు మహంతి సీతాలక్ష్మి బుధవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ప్రజలు తాగునీటికి ఇబ్బంది పడకుండా మంచినీటి కుళాయిలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. రాబోయే వేసవిలో తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. ఆమెతో పాటు సర్పంచ్ టొంపల సీతారాం, వైస్ సర్పంచ్ మహంతి జనార్దన రావు, పీఏసీఎస్ అధ్యక్షుడు మహంతి లక్ష్మణ రావు, తదితరులు ఉన్నారు.

మెగా డీఎస్సీపై తీర్మానం చేయాలి : డీవైఎఫ్ఐ



కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న డీఎస్సీ అభ్యర్థులు

విజయనగరం ఫూల్‌బాగ్: అసెంబ్లీలో మెగా డీఎస్సీపై తీర్మానం చేయాలని డీవైఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి జి. రామన్న, రాష్ట్ర ఉపాధ్యక్షుడు పీఎస్ఎన్ రాజు డిమాండ్ చేశారు. 25 వేల పోస్టులతో మెగా డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేయాలని కోరారు. ఈ మేరకు కోట జంక్షన్ నుంచి కలెక్టరేట్ వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి కలెక్టర్ నాగలక్ష్మికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సీహెచ్ హరీష్, ఎస్ఎఫ్ఐ నాయకులు పాల్గొన్నారు.

జూదరుల అరెస్ట్

భోగాపురం: మండలంలోని పోలిపల్లి గ్రామ శివారులో పేకాటాడుతున్న ఎనిమిది మందిని బుధవారం రాత్రి అరెస్ట్ చేసినట్లు సీఐ రవికుమార్ తెలిపారు. పేకాటాడుతున్నట్లు వచ్చిన సమాచారం మేరకు దాడి చేయగా.. ఎనిమిది మంది పట్టుబడ్డారన్నారు. వారి వద్ద నుంచి 19,320 రూపాయల నగదు స్వాధీనం చేసుకున్నామని తెలిపారు.

కోరుకొండంత అభివృద్ధి

- రూ. 84.7 లక్షలతో భవన నిర్మాణాలు
- రూ. 1.24 కోట్లతో బీటీ, సీసీ రోడ్ల నిర్మాణాలు
- రూ. 20.5 లక్షలతో కాలువలు, ప్రహరీలు
- లబ్ధిదారుల బ్యాంక్ ఖాతాలకు జమ చేసిన మొత్తం రూ. 22.72 కోట్లు
- పరోక్ష ప్రయోజనం కింద మరో రూ. 9.24 కోట్లు
- 175 మందికి ఇంటి స్థలంతో పాటు ఇళ్లు మంజూరు



రూ. 40 లక్షలతో నిర్మించిన కోరుకొండ గ్రామ సచివాలయం



గ్రామంలో నిర్మించిన రైతుభరోసా కేంద్రం

ఊరు మారింది



రూ. 88 లక్షలతో నిర్మించిన కోరుకొండ - కొత్తూరు రోడ్డు



నెయ్యిలపేట గ్రామంలో నిర్మించిన సీసీ రోడ్డు

విజయనగరం రూరల్: 'మాట తప్పను... మడమ తిప్పను..', 'నేను విన్నాను... నేను ఉన్నాను' అన్న మాటలను నిజం చేస్తూ నాలుగున్నరేళ్లలో పేదల సంక్షేమానికి అనేక సంక్షేమ పథకాలు అమలు చేసి పేదల పక్షపాతిగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి నిలిచారు. ఏ గ్రామం చూసినా... ఏ పేదింటిని కదిపినా నాలుగున్నరేళ్లలో వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమం, అభివృద్ధే కనిపిస్తోంది. గాంధీజీ కలలుగన్న గ్రామ స్వరాజ్యాన్ని గ్రామ సచివాలయ వ్యవస్థ ద్వారా ఏర్పాటు చేసి గ్రామాలను అభివృద్ధి చేసిన ఘనత ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డికే దక్కుతుంది. అలాగే అవినీతికి తావు లేకుండా, రాజకీయ సిఫార్సులకు అతీతంగా అర్హులైన ప్రతి పేదవాడికీ సంక్షేమ ఫలాలను అందిస్తున్నారు. అభివృద్ధి పనులకు కోట్లాది రూపాయలు మంజూరు చేయడంతో ఆయా గ్రామాల రూపురేఖలు మారిపోయాయి. విజయనగరం మండలం కోరుకొండ సచివాలయం పరిధిలోని గ్రామాలు కొండంత అభివృద్ధి సాధించడంతో ఆయా గ్రామాల ప్రజలు జననేతకు జేజేలు పలుకుతున్నారు. నాలుగున్నరేళ్లలో సంక్షేమ పథకాల కింద రూ. 31.96 కోట్లను నేరుగా లబ్ధిదారులకు అందించగా, అభివృద్ధి పనులకు మరో రూ. 2.4 కోట్ల నిధులు మంజూరు చేశారు.

రూ. 84.7 లక్షలతో భవన నిర్మాణాలు

జిల్లాలోనే మొదటి గ్రామ సచివాలయాన్ని నిర్మించిన గ్రామం కోరుకొండ. అప్పటికే పూర్తిగా శిథిలావస్థకు చేరుకున్న గ్రామ పంచాయతీ కార్యాలయం స్థానంలో రూ. 40 లక్షలతో గ్రామ సచివాలయ భవనాన్ని కార్పొరేట్ హంగులతో నిర్మించారు. రైతుల ప్రయోజనాలకు రూ. 23.94 లక్షలతో రైతుభరోసా కేంద్రం నిర్మించగా.. 24 గంటలూ ఇంటింటికీ వైద్యం అందించాలనే ఆశయంతో రూ. 20.80 లక్షలతో వైఎస్సార్ వెల్‌నెస్ కేంద్రాన్ని నిర్మించారు.

సంక్షేమ పథకాలకు ఖర్చు ఇలా...

వైఎస్సార్ పింఛను కానుక	: రూ. 7.74 కోట్లు
గృహ నిర్మాణాలకు	: రూ. 2.57 కోట్లు
వైఎస్సార్ రైతుభరోసాకు	: రూ. 3.35 కోట్లు
వైఎస్సార్ చేయూత	: రూ. 2.1 కోట్లు
జగనన్న అమ్మఒడి	: రూ. 1.97 కోట్లు
వైఎస్సార్ ఆసరా	: రూ. 1.68 కోట్లు

ఏ వీధి చూసినా కొత్త రోడ్లే..

కోరుకొండ గ్రామ పరిధిలోని ఏ గ్రామం చూసినా, ఏ వీధి చూసినా కొత్తగా నిర్మించిన సీసీ రోడ్లు, బీటీ రోడ్లే దర్శనమిస్తాయి. డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి చొరవతో గ్రామ సచివాలయ పరిధిలోని హరిజన కొత్తూరుకు కోరుకొండ గ్రామం నుంచి రూ. 88 లక్షలతో బీటీ రోడ్డు నిర్మించడంతో రెండు గ్రామాల ప్రజల రాకపోకలకు ఇబ్బందులు తీరాయి. అలాగే కోరుకొండ, కోరుకొండపాలెం, హరిజన కొత్తూరు, నెయ్యిలపేట గ్రామాల్లో లక్షలాది రూపాయలతో సీసీ రోడ్లను నిర్మించారు.

సొంతింటి కల నెరవేరింది



ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నికల్లో ఇచ్చిన మాట ప్రకారం ఇంటి స్థలంతో పాటు ఇంటిని మంజూరు చేశారు. ఇంటి నిర్మాణాన్ని పూర్తి చేసుకుని సొంతింటి కల నెరవేర్చుకున్నాం. జగనన్నకు జీవితాంతం రుణపడి ఉంటాం.

– సిరిపురపు యమున, హౌసింగ్ లబ్ధిదారు, కోరుకొండ గ్రామం

మనవడిలా ఆదుకుంటున్నాడు



ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఇచ్చిన మాట ప్రకారమే పింఛన్ పథకాన్ని పెంచుతూ రూ.3 వేలు అందిస్తున్నారు. అది కూడా గ్రామ వలంటీర్లు పొద్దు పొడవక ముందే ప్రతి నెలా ఒకటో తేదీన ఇంటికి తీసుకువచ్చి అందిస్తున్నారు. టీ, ఇతర ఖర్చులకు పిల్లలపై భారం కాకుండా సీఎం జగన్ మనవడిలా ఆదుకుంటున్నాడు.

– ఎల్తూటి రాములు, పింఛనుదారుడు, కోరుకొండ

అభివృద్ధే అజెండా



ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి సదాశయానికి తోడు స్థానిక ఎమ్మెల్యే, డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి సహకారంతో నాలుగేళ్లలో గ్రామ అభివృద్ధికి కృషి చేశాం. స్థానిక నాయకుల సహకారం తోడై ఎన్నో అభివృద్ధి పనులు చేపట్టాం. గ్రామ సచివాలయ పరిధిలోనే సంక్షేమం, అభివృద్ధికి సుమారు రూ. 40 కోట్లు ఖర్చు చేసిన ఘనత వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వానికే దక్కుతుంది.

– మైలపల్లి శంకర్, సర్పంచ్, కోరుకొండ గ్రామం



కార్పొరేట్ స్థాయికి తీర్చిదిద్దిన ఎంపీయూపీ పాఠశాల



గ్రామంలో నిర్మించిన జగనన్న కాలనీ



వైఎస్సార్ వెల్‌నెస్ కేంద్రం

ఇదేమి చోద్యం..!

- టీడీపీ నాయకులకే మళ్లీ కండువాలు
- తప్పుడు ప్రకటనలు మానుకోవాలి : వైఎస్సార్‌సీపీ నాయకులు



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు అప్పలనాయుడు, రమేష్, తదితరులు

పూసపాటిరేగ: మండలంలోని వెల్దూరు గ్రామానికి చెందిన టీడీపీ నాయకులు, కార్యకర్తలకే మళ్లీ కండువాలు వేసి టీడీపీలో చేరికలంటూ హడావిడి చేయడం హాస్యాస్పదమని వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు పతివాడ అప్పలనాయుడు, వైస్ ఎంపీపీ అల్లాడ రమేష్ అన్నారు. బుధవారం స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ, గ్రామానికి చెందిన 300 కుటుంబాలు టీడీపీలో చేరాయంటూ ఆ పార్టీ నాయకులు ప్రకటనలు గుప్పించడం సిగ్గుచేటన్నారు. ఆ గ్రామ సర్పంచ్ నాయిన సత్యవతి పంచాయతీ ఎన్నికలు ముగిసినప్పటి నుంచి వైఎస్సార్‌సీపీకి దూరంగా ఉందని.. రెండున్నరేళ్ల కిందటి నుంచే టీడీపీకి దగ్గరైందని చెప్పారు. ఆమె అనుచరులందరూ కూడా టీడీపీ నాయకులు, కార్యకర్తలేనని స్పష్టం చేశారు. అటువంటి వారందరికీ మళ్లీ కండువాలు వేసి పార్టీలో చేరారని టీడీపీ నాయకులు చెప్పుకుంటున్నారని, ఇది వారి సిగ్గులేనితనానికి నిదర్శనమని ఎద్దేవా చేశారు. రానున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ విజయం ఖాయమని, గ్రామంలో కూడా పార్టీకి గట్టి పట్టు ఉందని చెప్పారు. సమావేశంలో జేసీఎస్ కన్వీనర్ మహంతి శ్రీనివాస రావు, దారపు గున్నార్రెడ్డి, పుప్పాల లక్ష్మీనారాయణ, రౌతు సాయికుమార్, దారపు అప్పలసూర్రెడ్డి, దారపు లక్ష్మణరావు, పి.అప్పుడుదొర, లంకలపల్లి రాజారావు, తదితరులు పాల్గొన్నారు.

'జగనన్న ఆరోగ్యసురక్ష'ను సద్వినియోగం చేసుకోండి



జగనన్న ఆరోగ్యసురక్ష కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న చైర్‌పర్సన్ సరోజిని

నెల్లిమర్ల: జగనన్న ఆరోగ్యసురక్షను సద్వినియోగం చేసుకోవాలని నగర పంచాయతీ చైర్‌పర్సన్ బంగారు సరోజిని అన్నారు. నెల్లిమర్ల నగర పంచాయతీ పరిధిలో బుధవారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరాన్ని చైర్‌పర్సన్ బంగారు సరోజిని, వైఎస్సార్‌సీపీ పట్టణ శాఖ అధ్యక్షుడు చిక్కాల సాంబశివరావు సందర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పట్టణవాసులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని సిబ్బందికి సూచించారు. ప్రభుత్వం ఉచితంగా నిర్వహిస్తున్న శిబిరాలను ప్రజలంతా వినియోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్లు సముద్రపు రామారావు, కారుకొండ వెంకటకృష్ణారావు, 11వ వార్డు కౌన్సిలర్ చిక్కాల సంతోష్‌కుమార్, బూర సత్యనారాయణ, చిక్కాల లోకేష్, బంగారు శంకర రావు, తదితరులు పాల్గొన్నారు.

నులి పురుగుల నివారణకు ప్రత్యేక చర్యలు



భోగాపురం: సమావేశంలో మాట్లాడుతున్న డీఎంహెచ్ఓ భాస్కరరావు



పూసపాటిరేగ: మాట్లాడుతున్న జిల్లా వ్యాధి నిరోధక టీకా అధికారి అచ్యుతకుమారి

భోగాపురం: రాష్ట్ర ప్రభుత్వం నులి పురుగుల నివారణకు ప్రత్యేక చర్యలు చేపడుతోందని డీఎంహెచ్ఓ భాస్కరరావు తెలిపారు. ఈ నెల 9న నిర్వహించనున్న నులిపురుగుల నివారణ కార్యక్రమానికి సంబంధించి బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, హెల్త్ సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అంగన్‌వాడీ కేంద్రాలు, ప్రభుత్వ, ప్రవేటు పాఠశాలలు, కళాశాలల్లో చదువుకుంటున్న 19 సంవత్సరాల్లోపు విద్యార్థులకు ఉచితంగా మాత్రలు అందజేయాలన్నారు. అనంతరం నులిపురుగుల నివారణకు సంబంధించిన వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఉప్పాడ సూర్యనారాయణరెడ్డి, ఎంపీడీఓ జి. చంద్రకళ, పోలిపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి తిరుపతిస్వామి, ఎంఈఓ రమణమూర్తి, తదితరులు పాల్గొన్నారు.

విజయవంతం చేయాలి..

పూసపాటిరేగ: నులిపురుగుల నివారణ మాత్రల పంపిణీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జిల్లా వ్యాధినిరోధక టీకాల అధికారి ఎం. అచ్యుత కుమారి అన్నారు. స్థానిక ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో జాతీయ నులిపురుగుల నివారణ కార్యక్రమంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మండలంలో 21 వేల మంది పిల్లలకు ఆల్బెండోజోల్ మాత్రలు వేయడానికి ప్రణాళిక సిద్ధం చేశామన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ఎం. రాధిక, వైద్యాధికారులు రాజేష్ వర్మ, ప్రమీలాదేవి, తదితరులు పాల్గొన్నారు.

నేత్ర పరీక్షలు

పూసపాటిరేగ ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో జాతీయ అంధత్వ నివారణ సంస్థ ఆధ్వర్యంలో బుధవారం నేత్ర పరీక్షలు నిర్వహించారు. 63 మందిని పరీక్షించగా.. 30 మందిని శస్త్రచికిత్సలకు ఎంపిక చేశారు.

నేటి నుంచి వీధి నాటకాలు

విజయనగరం ఫోర్ట్: బేటీ బచావో బేటీ పడావో పథకంలో భాగంగా పిల్లలు, మహిళలకు రక్షణ కల్పించే చట్టాలపై స్త్రీ, శిశు సంక్షేమ ఆధ్వర్యంలో బుర్రకథలు, వీధి నాటకాలు ప్రదర్శించనున్నట్లు జిల్లా స్త్రీ, శిశు సంక్షేమ సాధికారిత అధికారిణి బి. శాంతకుమారి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. సుమారు 35 కార్యక్రమాలు రూపొందించినట్లు పేర్కొన్నారు. అవగాహన కార్యక్రమాలకు ప్రజలు హాజరు కావాలని కోరారు.

ఎస్టీ కమిషన్ చైర్మన్‌కు వినతి



వినతిపత్రం అందుకుంటున్న ఏపీ ఎస్టీ కమిషన్ చైర్మన్ డాక్టర్ డీవీజీ శంకరరావు

విజయనగరం అర్బన్: శ్రీకాకుళం జిల్లా సారవకోట, మెళియాపుట్టి, మందస మండలాల నుంచి పలువురు గిరిజనులు పట్టణంలోని ఏపీ ఎస్టీ కమిషన్ చైర్మన్ డాక్టర్ డీవీజీ శంకరరావును బుధవారం కలిశారు. గిరిజన ఐక్యవేదిక ఆధ్వర్యంలో వచ్చిన వీరు ఆయన్ని కలిసి పోడు పట్టాలు, ఉపాధికి సంబంధించిన పలు సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. దీనికి శంకరరావు స్పందిస్తూ, సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానన్నారు. ఆయన్ను కలిసిన వారిలో గిరిజన ఐక్య వేదిక నాయకులు చౌదరి లక్ష్మీనారాయణ, శాంతారావు, భాస్కరరావు, గంగన్న, తదితరులు పాల్గొన్నారు.

డీఏతో కలిపి వేతనాలివ్వాలి..

నెల్లిమర్ల: జూట్ కార్మికులకు ఫిబ్రవరి నెల డీఏతో కలిపి వేతనాలు ఇవ్వాలని సీఐటీయూ నాయకుడు కిల్లంపల్లి రామారావు డిమాండ్ చేశారు. ఈ మేరకు డిప్యూటీ లేబర్ కమిషనర్‌ను బుధవారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రామారావు మాట్లాడుతూ, జూట్ యాజమాన్యం 2016 నుంచి పేరుకుపోయిన గ్రాట్యుటీ బకాయిలు చెల్లించలేదన్నారు. అంతేకాకుండా రిటైర్డ్ కార్మికులకు యాజమాన్యం ప్రతి నెలా గ్రాట్యుటీ చెక్కులు ఇవ్వాల్సి ఉండగా... యాజమాన్యం రెండు నెలలు, మూడు నెలలకు ఒక సారి ఇవ్వడం సరికాదన్నారు.

మూఢ నమ్మకాలను విడనాడండి

- ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్ పద్మలత



కళాజాత నిర్వహిస్తున్న జన విజ్ఞాన వేదిక సభ్యులు

నెల్లిమర్ల రూరల్: మూఢ నమ్మకాలను విడనాడి శాస్త్రీయ దృక్పథం అలవర్చుకోవాలని ప్రిన్సిపాల్ జె. పద్మలత సూచించారు. మండలంలోని సతివాడ ఆదర్శ పాఠశాలలో జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో విద్యార్థులకు బుధవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, మానవుడు రోదసీలో ప్రయాణిస్తున్నా ప్రజలు మూఢ నమ్మకాలపై జాడ్యం వీడలేదన్నారు. విద్యార్థులు చైతన్యవంతులై తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలని సూచించారు. అనంతరం రాష్ట్ర స్థాయి సైన్స్ కళాజాతలో భాగంగా జనవిజ్ఞాన వేదిక బృంద సభ్యులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో కళాజాత అధ్యక్షుడు మురళీధర్, పాఠశాల హెచ్ఎం బంగారునాయుడు, జనవిజ్ఞాన వేదిక జిల్లా కమిటీ ప్రతినిధులు కామేశ్వరరావు, వెంకటరావు, మురళీబాబు, తదితరులు పాల్గొన్నారు.

రవికిరణ్‌కు వైఎస్సార్ హెల్త్ యూనివర్సిటీ అవార్డులు



వైఎస్సార్ హెల్త్ యూనివర్సిటీ అవార్డులను స్వీకరిస్తున్న రవికిరణ్

నెల్లిమర్ల రూరల్: మండలంలోని జోగిరాజుపేట గ్రామానికి చెందిన వైద్య విద్యార్థి కొంచాడ రవికిరణ్‌కు వైఎస్సార్ హెల్త్ యూనివర్సిటీ అవార్డులు వరించాయి. ఎంబీబీఎస్ ఈఎన్‌టీ విభాగంలో వైద్య విద్యను అభ్యసిస్తున్న రవికిరణ్ రాష్ట్రంలోనే అత్యుత్తమ మార్కులు సాధించాడు. ఈ నేపథ్యంలో విజయవాడలోని వర్సిటీ ప్రాంగణంలో జరిగిన స్నాతకోత్సవంలో డాక్టర్ పీఎస్ రావు, డాక్టర్ ఎస్ఎన్ మూర్తి పేరిట ఉన్న అవార్డులను వర్సిటీ ప్రతినిధులు అందజేశారు. దీంతో రవికిరణ్ స్వగ్రామంలో హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి.

స్టడీ మెటీరియల్ పంపిణీ



గ్రూప్- 2 అభ్యర్థులకు స్టడీ మెటీరియల్ అందిస్తున్న జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు

విజయనగరం రూరల్: గ్రూప్- 2 పరీక్షకు సిద్ధం అవుతున్న ఆర్థికంగా వెనుబడిన బీసీ, ఎస్టీ, ఎస్సీ అభ్యర్థులు 44 మందికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి సూచనలతో జెడ్పీ నిధులతో కొనుగోలు చేసిన స్టడీ మెటీరియల్‌ను జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు బుధవారం అందజేశారు. జెడ్పీ సమావేశ మందిరంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ, విద్యార్థులు పోటీ పరీక్షల్లో రాణించి జిల్లాకు పేరు ప్రఖ్యాతులు తీసుకురావాలన్నారు. స్టడీ మెటీరియల్ లేని 44 మందికి మెటీరియల్ అందించామని, పరీక్ష పూర్తయ్యే వరకు శిక్షణ పొందుతున్న విద్యార్థులకు మధ్యాహ్న భోజనం, సాయంత్రం స్నాక్స్ జెడ్పీ నిధులతో సమకూర్చాలని జెడ్పీ సీఈఓ కె.రాజ్‌కుమార్‌ను ఆదేశించారు. విజయనగరం బీసీ స్టడీ సర్కిల్ ద్వారా 2023 డిసెంబర్ 28 నుంచి ఈ నెల 24 వరకు 80 మంది ఎస్సీ, ఎస్టీ, బీసీ అభ్యర్థులకు ఉచిత శిక్షణ అందించినట్లు సీఈఓ తెలిపారు.

కలుషిత ఆహారంతో విద్యార్థులకు అస్వస్థత



సర్వజన ఆస్పత్రి క్యాజువాలటీలో చికిత్స కోసం వచ్చిన జేఎన్‌టీయూ జీవీ విద్యార్థినులు

విజయనగరం ఫోర్ట్: కలుషిత ఆహారం తీసుకోవడంతో జేఎన్‌టీయూ జీవీ విద్యార్థులు కొందరు బుధవారం అస్వస్థతకు గురయ్యారు. ఉదయం 10 గంటల సమయంలో కొందరు విద్యార్థులు వాంతులు, వికారంతో ప్రభుత్వ సర్వజన ఆస్పత్రికి వచ్చారు. వారికి క్యాజువాలటీలో వైద్యులు చికిత్స అందించారు. ఆరోగ్యం బాగుండడంతో హాస్టల్‌కు పంపించేశారు. రాత్రి 10 గంటల సమయంలో మరో ఏడుగురు విద్యార్థినులు వాంతులు, వికారంతో సర్వజన ఆస్పత్రికి వచ్చారు. వారికి వైద్యులు వైద్య సేవలు అందించారు. కలుషిత ఆహారం తీసుకోవడమే కారణమని వైద్యులు నిర్ధారించారు. ఆస్పత్రిలో సేవలు పొందిన వారిలో ఎం.కళ్యాణి, ఎం.ప్రియ, ఆర్.సుధ, కె.చంద్రిక, బి.తేజశ్విని, పి.విద్యేశ్వని, డి.మనీష ఉన్నారు.